# అనర్థం

అది ఒక చిన్న గది. గదిలో ఒక మూలగా సింగిల్ కాట్. దానిమీద ఫోం బెడ్. బెడ్ మీద అందమైన దుప్పటి.

గదిలో మరో మూల కాస్త పెద్ద టేబులు. టేబులుపై ఒక స్టీరియో కాసెట్ రికార్డరు. టేబుల్ లైటు. అందంగా సర్దిన పుస్తకాలు. టేబుల్ ముందు చిన్న కుర్చీ. కుర్చీపై అందమైన నాప్‌కిన్.

గదిలో మధ్యగా గోడవార చిన్న టేబులుంది. దాని మీద పోర్టబుల్ కలర్ టీవీ ఉంది. ఎంబ్రాయిడరీ చేసిన గుడ్డ కవరు టీవీని మూసింది. టీవీ పైన ఎలక్ట్రానిక్ అలారం గడియారముంది. అది టైము ఏడు గంటల యాభై రెండు నిముషాలు చూపిస్తోంది.

గదికి అటాచ్డ్ బాత్రూముంది.

బాత్రూం తలుపులు తెరుచుకుని గదిలో అడుగుపెట్టిందో యువతి.

ఆమె వయసు ఇరవైకి పైగా, పాతిక్కి లోపూ.

ఆమె శరీరం పచ్చగా బంగారంలా మెరుస్తోంది. అప్పుడే స్నానం చేసి వచ్చిందేమో వంటిపై మెరుస్తున్న నీటి బిందువులతో ఆమె ముత్యాలు పొదిగిన స్వర్ణహారంలా ఉంది.

ఆమె వంటి చూట్టూ టర్కిష్ టవలు.

ఆమె నెమ్మదిగా నడుస్తూ గది గోడలోకి ఫిక్సయిన ఆల్మైరా ముందుకు వెళ్ళి తలుపు తీసింది. అలమర తలుపుకున్న నిలువుటద్దంలో తన్ను తాను చూసుకుని టర్కిష్ టవలు విప్పింది.

మహాశిల్పుల కలల పంటలా ఉన్న దామె శరీరం.

ఆమె ప్రతిబింబం అద్దానికందాన్నిచ్చింది.

టవలుతో ఆమె వంటి మీద ముత్యాల్ని ఏరి వేసింది.

పట్టుదారాల్లాంటి శిరోజాల్ని సవరించి వదులుగా జడను వేసింది.

క్రమంగా ఆమె తన అందాన్ని అలమర నుంచి తీసిన బట్టలలో దాస్తూ అందానికి మెరుగులు దిద్దింది.

లేత గులాబి రంగు చీర స్పటికం వంటి ఆమె శరీరంలో ప్రతిఫలించి ఆమె వంటి రంగు మారింది.

"అరుణా! యూ ఆర్ వండ్రఫుల్" అంటూ ఆమె ప్రతిబింబాన్ని అభినందించింది. ఆమెతో పాటే ప్రతిబింబం బదులు తీర్చుకుంది. ప్రతిబింబం మాటల్లోనే ఎక్కువ న్యాయముందని ఎవరికైనా అనిపిస్తుంది.

అరుణ అలమర తలుపులు మూసి వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

బల్లమీది పుస్తకం తెరిచింది.

అందులో ఒక శుభలేఖ.....

శాంత వెడ్స్ రమేష్.....

శుభలేఖ ఆమెకు శాంత నుంచి వచ్చింది.

శాంత ఆమెకు ఇంటర్మీడియేట్లో క్లాసుమేటు. అంతేకాదు....... ఇద్దరూ ఆ సమయంలో బాగా కలిసి పోయిన స్నేహితురాండ్రు.

ఇద్దరూ కలిసి ఒక ఏడాది బియ్యే కూడా చదివారు. ఈ లోగా అరుణకు ఇంటర్మీడియేట్ అర్హత తోనే జాతీయ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఆమె చదువు మానేసింది.

ఆ విధంగా అరుణ, శాంత విడిపోయి ఆరేళ్ళయింది. అయినా వాళ్ళ మధ్య మూడేళ్ళ క్రితం దాకా జోరుగా ఉత్తరాలు నడిచాయి. తర్వాత జోరు తగ్గింది. శుభలేఖ రావడానికి ఆర్నెల్ల ముందు శాంత ఉత్తరం వ్రాసింది.

“మగాడు నలభై ఏళ్ళ దాకా పెళ్ళి చేసుకోక పోయినా బాధ లేదు. పదహారేళ్ళు దాటేక పెళ్ళికాని ప్రతి క్షణమూ ఆడపిల్లకు నరకమే” అన్నదా ఉత్తరంలోని సారాంశం.

అరుణ అభిప్రాయంలో శాంత చాలా అదృష్టవంతురాలు.

శాంత తలిదండ్రులకు ఒక్కగానొక్క కూతురు. ఆమెకు ఒక్కడే అన్న. మంచి కట్న మిచ్చి పెళ్ళి చేయగల సమర్థత ఆ కుటుంబానికి ఉంది.

శాంతకు పెళ్ళి గురించి ఎన్నో కలలున్నాయి. తన భర్త ప్రపంచాన్ని జయించగల మహావీరుడు కావాలని ఆమె కోరలేదు. కానీ శ్రీరామచంద్రుడి వంటి సచ్ఛీలుడు, ఏకపత్నీ వ్రతుడు కావాలని అనుకునేది.

కలల విషయంలో శాంతతో అరుణ ఏకీభవించేది.

వరుడు కట్నం అడగవచ్చు. కానీ కట్నం కోసం మాత్రమే తన్ను పెళ్ళాడకూడదు. విద్యాధికుడై మంచి ఉద్యోగంలో ఉండాలి.

విద్యాధికులకు దురలవాట్లుండవనీ, మంచి ఉద్యోగంలో ఉన్నవాడికి ఉద్యోగరీత్యా అయినా సత్ప్రవర్తన ఉంటుందనీ ఆ యువతులిద్దరూ అభిప్రాయపడ్డారు.

శాంతకు చాలా సంబంధాలు చూశారు. చాలా వరకూ శాంతా వాళ్ళే వదులుకున్నారు, వరుడి వివరాల్లో ఏదో ఒక లోపం కనిపించి!

ఇప్పుడు శాంతకు పెళ్ళి......

ఆ పెళ్ళి రమేష్‌తో......

రమేష్ అరుణకు తెలుసు.....

చెప్పాలంటే బాగా దగ్గరగా తెలుసు........

రమేష్‌ని తలచుకున్నప్పుడల్లా అరుణకు గుర్తుకు వచ్చేది బీచి వద్ద సంఘటన......

ఆరోజు బీచి వద్ద మసక చీకటిలో తామిద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు అమాయకంగా తానేమేమో మాట్లాడుతూంటే అతడు మౌనంగా వింటున్నాడు.

“నువ్వేం మాట్లాడవేం?” అంది అరుణ.

అతడు చటుక్కున ఆమె ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకుని పెదాల మీద ముద్దు పెట్టు కున్నాడు.

క్షణం పాటు అరుణకు జరిగిందేమిటో తెలియలేదు.

ఒక్క క్షణం ఆమెకు నర నరాల విద్యుత్తు ప్రవహించిన మాట నిజం. కానీ ఆ వెనువెంటనే ఆమె తేరుకుని చుట్టూ చూసింది. ఎవరూ తమను గమనించలేదని తేలికగా నిట్టూర్చి అతడికి దూరంగా జరిగింది.

“అయాం సారీ! నిగ్రహించుకోలేక పోయాను” అన్నాడు రమేష్.

అరుణ మాట్లాడ లేదు. తర్వాత నుంచి అతడికి దూరంగా ఉండసాగింది. కానీ అతణ్ణి పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన కూడా ఆమెలో కలిగింది.

అరుణకు ఒక్కగానొక్క అన్నను మినహాయించి ఎవ్వరూ లేరు. అన్న ఆమె కంటె పది సంవత్సరాలు పెద్ద. ఆరేళ్ళ క్రితం అతడికి పెళ్ళయింది. అప్పట్నించీ అరుణ విషయంలో అంటీ ముట్టనట్లుంటున్నాడు. ఆమె ఎవరినైనా పెళ్ళి చేసుకుంటాననంటే నాలుగు అక్షింతలు వేయాలనే తప్ప తనకు తానై సంబంధాలు చూడ్డంలేదు. అరుణ రమేష్‌ను పెళ్ళి చేసుకుంటాననంటే అన్నకేమీ అభ్యంతరముండదు.

కొన్నాళ్ళాగి రమేష్ ఆమెను మళ్ళీ ఏదో పార్టీ పేరు చెప్పి ఆహ్వానించాడు. అరుణ మృదువుగా నిరాకరించి, "మీ పెద్దవాళ్ళతో మాట్లాడు. పెళ్ళి చేసుకుందాం" అంది.

'సరే'నన్నాడు రమేష్. కానీ అతడు అరుణను కలుసుకోవడం తగ్గించాడు. ఆమె అతడి గురించి అరాలు తీసింది.

అప్పుడు బయటపడ్డాయి చాలా విషయాలు.

రమేష్ మోసగాడు.

అతడి వలలో పడి ఓ పిల్ల ఆత్మహత్య చేసుకుంది. ఇంకోపిల్ల ఊరొదిలి వెళ్ళిపోయింది. ప్రస్తుతం అతడు ఒకరికి తెలియకుండా ఒకరితో ముగ్గురమ్మాయిలతో తిరుగుతున్నాడు. అందులో అరుణ కూడా ఉంది.

కాస్త ప్రయత్నిస్తే ఏ ఆడపిల్లకైనా మగాడి గుట్టు మట్లు తెలుస్తాయి. కానీ వయసు మైకం, అమాయకత్వం కలిసి ఆడపిల్లను మోసానికి గురి చేస్తాయి. అందుకే రమేష్ వంటి వారి ఆటలు కొనసాగుతున్నాయి.

మగాడు మేడిపండు. చిలకలపూడి బంగారం.

అరుణ రమేష్‌ని అసహ్యించుకోవడం ప్రారంభించింది.

అయితే ఆమె ఆశ్చర్యపోయే విధంగా ఒక రోజున రమేష్ ఆమె వద్దకు వచ్చి తను పెళ్ళికి సిద్ధమేనన్నాడు.

అరుణ తెల్లబోయింది. తర్వాత మండి పడి అతణ్ణి నానా మాటలూ అంది. అతడి చరిత్ర చెప్పింది.

ఆమెకు తన గురించి అన్ని వివరాలు తెలిసినందుకు రమేష్ కూడా ఆశ్చర్యపోయాడు. కానీ నెమ్మదిగా తమాయించుకుని, "వయసులో ఎవరైనా పొరపాట్లు చేస్తారు. వాటిని సీరియస్‌గా తీసుకోకూడదు. నా గురించి నీకు ముందే అన్నీ తెలుసు కాబట్టి మనిద్దరికీ మంచి అవగాహన ఉంటుంది. మా వాళ్ళు నా మాట కాదనరు. నువ్వూ నా మాట కాదనకు"అన్నాడు.

అరుణ అతడి వంక అసహ్యంగా చూసి, "అన్నీ తెలిసి నిన్ను పెళ్ళి చేసుకుంటానా? అడగడానికి సిగ్గు లేదూ నీకు? నేనే కాదు, నీ సంగతి తెలిస్తే ఏ ఆడపిల్లా నిన్ను పెళ్ళి చేసుకోదు. ఇంకెప్పుడూ నా దగ్గరకు రాకు, వెళ్ళు!" అంది.

రమేష్ శాంతంగా, "నా సంగతి తెలిసినా ఏ ఆడపిల్లయినా నన్ను పెళ్ళి చేసుకుంటుంది. కానీ నేనొకసారి నిన్ను ముద్దు పెట్టుకున్నానని తెలిస్తే ఏ మగాడూ నిన్ను పెళ్ళి చేసుకోడు.

కారణం తెలుసా?" అన్నాడు.

అరుణ మాట్లాడలేదు. ఆమెకు రమేష్ ముద్దు గుర్తుకు వచ్చి వళ్ళంతా కంపరంగా అనిపించింది.

'స్త్రీకి సమాన హక్కులు కావాలని గొప్ప వాళ్ళందరూ ఘోషిస్తారు. కానీ ఆడదానికి హక్కు లు వస్తాయేమోకానీ సమాన విలువ రాదు. స్త్రీ పురుషుల్లో అన్ని విధాలా స్త్రీయే గొప్పది కావచ్చు. కానీ స్త్రీ జీవితానికి అర్థం కావాలంటే మగాడు కావాలి. అర్థం అంటే డబ్బు. గొప్ప వాళ్ళందరూ అన్ని అనర్థాలకూ మూలం డబ్బు అంటారు. అయినా అంతా డబ్బు సంపాదించాలనే ప్రయత్ని స్తారు. ఆడదానికి మగాడూ అంతే! మగాడు తోడు లేని జీవితం ఆడదానికి అనర్ధమే అవుతుంది. కాబట్టి జరిగింది మరిచిపో, మనం పెళ్ళి చేసుకుందాం!' అన్నాడు రమేష్.

"గెటౌట్" అంది అరుణ.

ఆ తర్వాత ఆమె రమేష్ మాటలకు సవాలుగా తనసలు పెళ్ళే చేసుకోకూడదని అనుకుంది.

మగాడంటే ఆమెకు కోపముంది. కానీ ఆమె శరీరానికి మగాడి అవసరం లేదనడానికి లేదు.

అవసరానికి పెళ్ళే చేసుకోవాలా అని ఆమె చాలా సార్లు ఆలోచించింది. కానీ బలంగా పాతుకు పోయిన సంప్రదాయం ఆమె ఆలోచనలను మొగ్గలోనే త్రుంచేసి, 'అలా ఆలోచిస్తే నీవు రమేష్ వంటి మోసగాళ్ళకు సాయపడిన దానివౌతావు. వాళ్ళు కోరేదీ యిదే!' అని హెచ్చరించింది.

అరుణకు తన ఆలోచనల్లోని పొరపాటు అర్ధమయింది. ఆమె మంచి వరుణ్ణి ఎన్నుకుని పెళ్ళి చేసుకోవాలనుకుంది.

పెళ్ళికాని ఆడదాని ఒంటరి జీవితం సజావుగా ఉండే స్థాయికి మన సమాజమింకా ఎదగలేదు.

సమాజంలో వివాహిత స్త్రీకి ప్రత్యేక గౌరవం.....

అవివాహిత అయిన యువతి వైపు వివాహిత పురుషులతో సహా ఎందరో ఆకలి చూపులు చూస్తారు. రక రకాల వలలు విసురుతారు.

చాలామందికి ఆమె సంపాదనపై కూడా ఆశ ఉంది.

తన్ను తానుగా ప్రేమించే వ్యక్తి కోసం ఎదురు చూస్తోంది అరుణ. ఆ పని తన వల్ల కాదనిపించి శాంత కుత్తరం వ్రాస్తే, "నాకు తప్పక మంచి వరుడు దొరుకుతాడు. అప్పుడు మేమిద్దరం కలిసి నీ గురించి వరుణ్ణి వెతుకుతాం" అని రెండేళ్ళ క్రితం ఆమె అరుణ కుత్తరం వ్రాసింది.

ఇప్పుడు అరుణ ముందు శాంత పెళ్ళి శుభలేఖ ఉంది.

శుభలేఖలో వరుడి వివరాలున్నాయి.

శాంత రమేష్‌ని పెళ్ళాడుతోంది.

ఎలాగైనా ఈ పెళ్ళి ఆపాలి... కానీ ఎలా?

అరుణ ఆలోచిస్తోంది.

పెళ్ళికింకా పది రోజుల టయిముంది. వెళ్ళి రమేష్‌తో మాట్లాడితే!

అరుణకీ ఆలోచన నచ్చలేదు. రమేష్ వద్దకు వెడితే తన్ను అవమానించగలడు. ముందు జాగ్రత్త పడి శాంతకే మాయ మాటలతో నచ్చజెప్పగలడు.

అరుణ వద్ద రమేష్ తనకి వ్రాసిన ఉత్తరాలున్నాయి. రమేష్ వల్ల మోసపోయిన మరో అమ్మాయి వ్రాసిన ఉత్తరముంది. రమేష్ ఇద్దరమ్మాయిలతో విడి విడిగా తీసుకున్న ఫోటోలున్నాయి. ఆ ఫోటోల్లో వాళ్ళెంత దగ్గరగా ఉన్నారంటే రమేష్ గురించి మరో సాక్ష్యం అవసరంలేదు.

శాంత ద్వారా రమేష్ ఊహకందని అవమానం పొందాలి. అది మగ జాతికే తలవంపు కావాలి.

అరుణ ఏం చేయాలో కచ్చితంగా నిర్ణయించుకుంది.

అందమైన అరుణ మనసులో అంత కఠినమైన ఆలోచన ఉంటుందని ఎవరూ ఊహిం చలేరు.

అరుణ కుర్చీలోంచి లేచింది.

ఆలోచనలతో బరువెక్కిన మెదడు, అసంతృప్తితో బరువెక్కిన మనసు ఆమెను ఎక్కువసేపు నిలబడనివ్వలేదు. నడుం వాల్చాలని మంచం వైపు నడిస్తే ఎవరో తలుపు తట్టారు.

అరుణ వెళ్ళి తలుపు తీసింది. గుమ్మంలో వ్యక్తిని చూసి తెల్లబోయింది... ఆమె శాంత!

శాంత చటుక్కున లోపలకు వచ్చి తలుపులు వేసి అరుణను బలంగా కౌగిలించుకుని బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

అరుణ ఉక్కిరి బిక్కిరయింది.

ఇద్దరూ వెళ్ళి మంచం మీద కూర్చున్నారు.

''నాకు ఆప్త మిత్రురాలివి. నిన్ను నేను స్వయంగా పిలుస్తానంటే అన్నయ్య నన్ను ప్రత్యేకంగా అనుమతించాడు. మధ్యాహ్నం బస్సులో మన మిద్దరం కలిసి వెళ్ళాలి. ఆఫీసుకు సెలవు పెట్టు'' అంది శాంత.

''ఆఫీసుకు సెలవు పెట్టాలనే అనుకున్నాను. కానీ ఇప్పుడు నువ్వొచ్చేశావు కాబట్టి ఇక సెలవు పెట్టనవసరంలేదు'' అంది అరుణ.

''నేను వచ్చింది నిన్ను తీసుకువెళ్ళడానికి'' అంది శాంత.

''నేను రావాలనుకున్నది నిన్ను చూడ్డానికి''అంది అరుణ.

"నన్నేకానీ నా పెళ్ళి చూడవా" అంది శాంత.

"నీ పెళ్ళి నేను చూడలేను. కారణం...." అని ఆగింది అరుణ.

'ఏమిటి నువ్వు చేయబోతున్న పని?' అని హెచ్చరించిందామె మనస్సు.

వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చేయాలంటారు. తనో నిజం చెప్పి పెళ్ళి చెడగొట్టాలను కుంటోంది.

అందులోనూ తన పెళ్ళి కుదిరిందని శాంత ఎంతో సంతోషంగా ఉంది.

"నా పెళ్ళి ఎందుకు చూడలేవు?" ఆత్రుతగా అడిగింది శాంత.

అరుణ శాంతను చూసింది.

అప్పుడామెకు రమేష్ ముద్దు గుర్తుకు వచ్చింది.

ఛీ... ఆ రమేష్ శాంతను పెళ్ళి చేసుకుంటాడా... వీల్లేదు...

శాంత ముఖం అమాయకంగా ఉంది. ఆ అమాయకురాలిని రమేష్ వంటి వంచకుడికి అప్పగిస్తూంటే తను చూస్తూ ఊరుకోగలదా?

"శాంతా! నేనే ఆశ్చర్యపడేటంత అందం నాకుంది. నా కాళ్ళ మీద నేను నిలబడగలను. కానీ అయినవాళ్ళు పూనుకోక నాకు తగిన వరుడు దొరకడంలేదు. నీ సంగతలాకాదు. నీ కోసం ప్రాణం పెట్టే అన్న ఉన్నాడు... కాబట్టి నేను చెప్పేది జాగ్రత్త గా విను..."

అరుణ తను చెప్పదల్చుకున్నది సవివరంగా చెప్పింది. సాక్ష్యాలు చూపించింది. ఆపైన ఈ పెళ్ళి చేసుకోవద్దనీ రమేష్ గుట్టు బయటపెట్టి పది మందిలోనూ అవమానించమనీ సలహా ఇచ్చింది.

ఇలాంటి విశేషం వినడానికి శాంత సిద్ధంగా లేదు. ఆమె షాక్ తింది. అందులోంచి తేరుకుందుకు ఆమెకు కాసేపు పట్టింది. తర్వాత ఆమె అరుణ చెప్పిన వివరాలన్నింటినీ పేరు మోసిన లాయర్ని మించి క్రాస్ ఎగ్జామిన్ చేసింది.

రమేష్ అపరాధాలు నిస్సందేహంగా ఋజువయ్యాయి.

శాంత ముఖం పాలిపోయింది.

"బాధ పడకు. నీ అదృష్టం కొద్దీ పెళ్ళికి ముందే ఈ విషయాలు తెలిశాయి. అంతా మన మంచికే అనుకో..." ఓదార్చింది అరుణ.

చాలాసేపు శాంత మౌనంగా ఉంది.

"ఏమైనా మాట్లాడవే!" అంది అరుణ.

"కాసేపు నన్నాలోచించుకోనీ..."అంది శాంత.

సుమారు రెండు గంటలు ఆలోచించింది శాంత.

ఈలోగా అరుణ తన ఆఫీసుకు ఆ రోజుకు సెలవు చీటీ పంపింది. గదికి రెండు భోజనాలు తెప్పించింది.

రెండే రెండు గంటల బస్సు ప్రయాణం చేస్తే వస్తుంది శాంత ఊరు. కానీ ఆ రోజు

తనకిక ప్రయాణముంటుందని అరుణ అనుకోవడంలేదు.

ఇద్దరూ భోజనాలు చేశారు.

"ఏమాలోచించావు?"

"నీ దగ్గరున్న ఫొటోలు,ఉత్తరాలు నాకిస్తావా?" అంది శాంత.

"ఎందుకు?"

"మనిషిని నిలదీసినప్పుడు సాక్ష్యాలుండాలి కదా!"

అరుణ ముఖం వికసించింది. ఆమె శాంతకు కావలసినవన్నీ ఇచ్చింది.

" మరి నువ్వు పెట్టి సర్దుకో, బయల్దేరదాం" అంది శాంత.

"నేనెక్కడికి?"

"నా పెళ్ళికి..."

"ఇన్నీ తెలిసి ఇంకా ఈ పెళ్ళి చేసుకుంటావా?" తెల్లబోయింది అరుణ.

"ఏం?" అంది శాంత.

"ఈపెళ్ళి చేసుకుంటే నీ జీవితం అనర్థమవుతుంది..."

"ఆడదానికి పెళ్ళికాకపోవడమే అనర్థం... అభిమానించే అయినవాళ్ళున్న ఆడదానిగా నేను తెలుసుకున్న నిజమిది..."అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంది శాంత.

"అయితే నా దగ్గర ఆ ఉత్తరాలూ, ఫొటోలు ఎందుకు తీసుకున్నావు? సాక్ష్యాలను సమూలం గానూ, శాశ్వతంగానూ నాశనం చేయాలనా?"

"కాదు... రమేష్‌ని నిలదీయాలని! కానీ ఇప్పు డు కాదు... పెళ్ళాయ్యాక... పెళ్ళి కాకుండా రమేష్‌ని నిలదీస్తే అంతా నన్నే వేలెత్తి చూపుతారు. అదే పెళ్ళయ్యాక భార్యగా అతన్ని నిలదీస్తే మొత్తం సమాజం నా వెనుక నిలబడి నాకు ఆసరాగా ఉంటుంది. అరుణా! ప్లీజ్... అతడెవరైనా... ఎలాంటివాడైనా కానీ... నా పెళ్ళి ఆపాలని చూడకు. ఇంత వరకూ వచ్చి ఈ పెళ్ళి ఆగిపోతే ఈ జన్మకు నాకు పెళ్ళి కాదు. నువ్వు నా క్షేమం కోరిన దానివని నాకు తెలుసు. అందుకే బ్రతిమాలు కుంటున్నాను. రమేష్ గురించి నీకు తెలిసిన నిజాలు నీలోనే ఉంచుకో! కనీసం ఈ పెళ్ళయ్యే దాకా అయినా ఈ రహస్యం రహస్యంగా ఉండి పోనీ." అంది శాంత.

అరుణ నోట మాట రాలేదు.

ఆర్థిక స్వాతంత్ర్యమున్న అద్భుత సౌందర్యవతిని వంచనతో కాక ప్రేమతో చేరదీసి పెళ్ళాడాలనే యువకులు లోపించిన ఈ సమాజంలో, అయిన వాళ్ళు కుదిర్చే లోపభూయిష్ట వివాహానికి అన్నీ తెలిసి తల వంచే యువతులున్న ఈ సమాజంలో పెళ్ళి ఒక అనర్థం కాదా? ఈ అనర్థపు దాంపత్య ఫలాలతో వర్ధిల్లుతున్న ఈ సమాజమే ఒక అనర్థం కాదా?

శాంత వెళ్ళిపోయింది. అరుణ ఆమె పెళ్ళికి వెళ్ళలేదు.

అనర్థం ఇంకా పెళ్ళికాని తన జీవితంలో ఉన్నదో, అప్పుడే పెళ్ళియిన శాంత జీవితంలో ఉన్నదో ఎంత ఆలోచించినా అరుణకు స్ఫురించడంలేదు. ★

*రచన సచిత్ర మాస పత్రిక- సెప్టెంబర్ 1993)*